క్లుప్తంగా

నేటినుంచి పాఠశాలల్లో సందడి ప్రారంభం


సత్యవరం ఉన్నత పాఠశాలలో తరగతి గదిని పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలో 83 పాఠశాలలతో పాటు జ్యోతీరావుపూలే రెసిడెన్సియల్ స్కూల్ ఉంది. ఈ మేరకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. బుధవారం స్కూల్ పరిసరాలతోపాటు తరగతి గదులను పరిశుభ్రం చేయించారు. సమయానికి స్కూళ్లు తెరవాలని ఉపాధ్యాయులకు ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు సూచించారు.

యువత క్రీడల్లో రాణించాలి


నెట్ ప్రాక్టీస్‌ను ప్రారంభిస్తున్న వైకుంఠరావు


కొత్తూరు: యువత క్రీడల్లో రాణించాలని మండలంలోని గూనభద్ర ఆర్ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.వైకుంఠరావు అన్నారు. గూనభద్ర ఆర్ఆర్ కాలనీలో క్రికెట్ నెట్ ప్రాక్టీస్ పిచ్‌ను బుధవారం ప్రారంభించారు. యువకులు క్రీడలపై మక్కువ చూపించాలన్నారు. విద్యతోపాటు క్రీడల్లో రాణించడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్.శివకేశవరావు, క్రీడాకారులు కె.మధు, తిరుపతిరావు, భగవాన్ పాల్గొన్నారు.

జోరుగా పంట కాలువల అభివృద్ధి పనులు


చాపరలో కాలువ పనులు చేస్తున్న ఉపాధి వేతనదారులు

మెళియాపుట్టి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట కాలువల అభివృద్ధి పనులు జోరుగా నిర్వహిస్తున్నారు. రైతులు వేసవి దుక్కులలో బిజీబిజీగా గడుపుతూ.. పొలంబాట పట్టారు. వర్షాలు సైతం పడే సూచనలు కనిపిస్తూ ఉండటంతో ఖరీఫ్ పనులకు సిద్ధమయ్యారు. పంట కాలువలను ఇప్పుడు బాగుచేసుకుంటే వర్షాలు పడే సమయంలో పొలాలకు నీరు సులువుగా చేరుతుందని పలువురు రైతులు చెబుతున్నారు. అందులో భాగంగానే ఉపాధి సిబ్బంది సైతం రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి సారించారు. ఉపాధి సిబ్బందికి ఎంపీడీఓ భాస్కరరావు ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తున్నారు. గ్రామాలలో ప్రభుత్వ భవనాలు, చెరువు గట్లపై మొక్కలు నాటడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

స్టూడెంట్ కిట్లు అందరికీ అందజేయాలి


ఎమ్మార్సీ సిబ్బందితో చర్చిస్తున్న జనార్దనావు

సారవకోట: స్టూడెంట్ కిట్లు ప్రతి విద్యార్థికీ అందజేయాలని సమగ్ర శిక్ష పరిశీలకులు జనార్దనావు అన్నారు.మండల కేంద్రంలో ఎమ్మార్సీ సిబ్బందితో కిట్లు పంపిణీ గూర్చి బుధవారం చర్చించారు. గురువారం ఈ కిట్లు పంపిణీ ఉంటుందని, దీనికి ముందస్తుగా తీసుకోవాల్సిన ఏర్పాట్లు గూర్చి చర్చించినట్లు తెలిపారు. ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: మండలంలోని ప్రైవేట్ స్కూళ్లన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేయాలని ఎంఈఓ శాంతారావు సూచించారు. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు, బస్సులకు ఉన్న లైసెన్సులు తదితర వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. కొందరు స్కూల్ యాజమాన్య ప్రతినిధులు బుక్స్ పేరిట వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుందని ఎంఈఓ హెచ్చరించారు.

కట్టెజనుము సాగు.. ఆదాయం బాగు


వెంకటాపురం వద్ద ఏపుగా పెరిగిన కట్టె జనుము పంట

- మెళియాపుట్టిలో 1350 ఎకరాల్లో సాగు
- భూసారంతోపాటు అదనపు ఆదాయం

మెళియాపుట్టి:

పంట మార్పిడి విధానంలో రైతులు కట్టె జనుము (తెట్టంగి) సాగు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఖర్చు తక్కువగా ఉంటుంది. ఎకరాకు సుమారు రూ.20 వేల ఆదాయం వస్తుంది. గతంలో ఈ పంట పరిచయంలేని రైతులకు ప్రస్తుతం మక్కువ పెరిగింది. మండలంలో సుమారుగా 1,350 ఎకరాల్లో ఈ పంటను పండిస్తున్నారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది ఫైబర్, పచ్చిరొట్ట ఎరువుగానే కాకుండా.. దీని ద్వారా వంట నూనె సైతం తయారవుతుంది. పలు తినుబండారాల్లో ఈ గింజలను వాడుతున్నారు. విత్తనాలు చల్లడం, పంట సేకరించడం తప్పితే ఎరువులు వేయడం, నీటి అవసరం, కలుపు తీయడం లాంటి పనులు ఉండవు. పట్టుపురం, పెద్దలక్ష్మీపురం, పెద్దపద్మాపురం, తదితర గ్రామాల్లో ఈ పంట అధికంగా పండిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి మెరుగైన లాభాలు అర్జిస్తున్నారు.

ఖర్చు తక్కువ



ఎకరానికి 16 కేజీల తెట్టంగి విత్తనాలు అవసరం. దాని విలువ రూ.1300, మిగతా ఖర్చులతో కలిపి సుమారుగా ఎకరాకు రూ.2,500 అవుతుంది. రూ.18 వేలు నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తుంది. గతేడాదితో పోల్చితే రెండు రెట్లు ఎక్కువగా ప్రస్తుతం 1,350 ఎకరాల్లో పంట పండిస్తున్నారు.

– ధానకర్ణుడు, ఏఓ, మెళియాపుట్టి

ఆదాయం బాగుంది



నేను గతేడాది కంటే ఒక ఎకరం పంట అధికంగా వేశాను. పంట నష్టపోతామనే భయంలేదు, ఆదాయం బాగుంది. వేసవి పంటగా మా గ్రామానికి చెందిన రైతులందరూ తెట్టంగినే ఎంచుకున్నారు.

– బైపోతు ఆనందరావు, రైతు, పెద్దలక్ష్మీపురం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

జలుమూరు:

సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. చల్లవానిపేట పంచాయతీలోని వైఎస్సార్ కాలనీలో మలేరియా మాసోత్సవాలు సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. వారంలో ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తలనొప్పి, జ్వరంతోపాటు కాళ్లు పీకులు, వంటపై ఎర్రటి దద్దుర్లు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వై.కె.శ్రీనివాసరావు హెచ్‌ఎస్ చిన్న రాజులు, హెచ్‌ఏ చిన్నారావు, సిబ్బంది సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


పురుగు మందులను తనిఖీ చేస్తున్న ఏడీ రవీంద్రభారతి


విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ రవీంద్రభారతి

జలుమూరు: వ్యాపారులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, రైతులు కూడా కొనుగోలు చేసిన వాటికి రశీదులు పొందాలని వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర భారతి అన్నారు. చల్లవానిపేటలో పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులకు పలు సూచనలు చేశారు. రైతులు కూడా విత్తనాల మొలక శాతం పరీక్షించి పొలంలో వేయాలన్నారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే శాఖా పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డుల నిర్వహణ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ఏఓ కె.సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


నరేంద్రరావును అభినందిస్తున్న కళింగ కోమట్ల సంఘం ప్రతినిధులు

నరసన్నపేట:

స్థానిక శ్రీరామ్‌నగర్‌కు చెందిన విద్యార్థి జామి నరేంద్రరావును కళింగ కోమట్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం అభినందించారు. నరేంద్రరావు జేఈఈ అడ్వాన్స్‌లో 2,795వ ర్యాంకు, ఏపీ ఈఏపీ సెట్‌లో 304వ ర్యాంకు సాధించారు. జేఈఈ అడ్వాన్స్, ఏపీ ఈఏపీ సెట్‌ల్లో ప్రతిభ చూపిన తంగుడు దీపక్‌ను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఊణ్న వెంకటేశ్వరరావు, వి.రమేష్, వైశ్యరాజు కేశవరాజు, ఊణ్న రంగనాథ్, పి.సాయి, బోయిన బాలకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫారం-16 అందుబాటులోకి తీసుకురావాలి


వినతిపత్రం అందజేస్తున్న అసొసియేషన్ ప్రతినిధులు

ఆమదాలవలస: ఆమదాలవలస సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలో గల పెన్షనర్లకు ఫారం–16 అందుబాటులోకి తేవాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసొసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆమదాలవలస సబ్‌ట్రెజరీ కార్యాలయంలో సబ్‌ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ఫారం –16ను ఇప్పటినుంచి అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ నెల 15 నుంచి జూలై 31వ తేదీ లోగా పెన్షనరులందరూ ఈ ఫైలింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కార్యవర్గ సభ్యుడు హెచ్.వి.సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగుకు సిద్ధం


విత్తనాలు నాటేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

కొత్తూరు: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు, భామిని, సీతంపేట, హిరమండలం మండలాల్లో పత్తి సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వరి తరువాత ప్రధాన పంటగా పత్తి సాగు చేస్తారు. నాలుగు మండలాల్లో సుమారు 15 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు చేస్తున్నారు. వర్షాలు అనుకూలిస్తే జూన్ రెండో వారం నుంచి పత్తి విత్తనాలు నాటుతారు. ప్రస్తుతం పత్తి సాగు చేయనున్న భూములను దుక్కులు చేసి సిద్ధం చేశారు. ఇప్పటికే పత్తి విత్తనాలు కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్నారు.

ఉపాధి పనుల పరిశీలన


మూర్తిమానుగడలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

కొత్తూరు: రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని ఉపాధి వేతనదారులకు ఎంపీడీఓ కె.త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని మూర్తిమానుగూడ, పిల్లగూడ గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన రైతుల కొండపోడు భూముల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. వేతనదారుల హాజరు తనిఖీ చేశారు. కొండ పైనుంచి వచ్చే వర్షం నీరు నిల్వ ఉండేలా పనులు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. ప్రతి గిరిజన వేతనదారుడు ఉపాధి పనులు వినియోగించుకోవాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రామోజీరావు మృతికి సంతాపం

ఆమదాలవలస: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి ఆమదాలవలస ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నివాళులర్పించారు. స్థానిక గాంధీ జంక్షన్ వద్ద రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సీనియర్ పాత్రికేయులు ధనుంజయరావు, గురుగుబిల్లి ప్రసాదరావు, తాండ్ర అప్పలనాయుడు, పూర్ణారావు, డి.శ్రీనివాసరావు, అప్పలనాయుడు, చంటి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ దాతృత్వం


సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధి కిల్లిపాలెం–2 లో ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న కళ్యాణి సుహాసిని కుమార్తె యశోద అనారోగ్యంతో బాధపడుతోంది. ఈమెకు అండగా నిలిచేందుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ముందుకు వచ్చింది. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి నాయకులు టి.తిరుపతిరావు, మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, సహాయ కార్యదర్శి పార్థసారథి, డి.గణేష్, ముఖ్య సలహాదారు నల్లపిల్లి బాబూరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మణి, సోషల్ మీడియా ప్రతినిధి ఆరుగురు రమణ, రామచంద్ర, సోగ్గాడు సూర్యకళ ఉన్నారు.

కల్యాణం.. కమనీయం


సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నరసన్నపేట: స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని సీతారామ ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను అలంకరించి ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం తిరువీధి చేపట్టారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి పతివాడ గిరీశ్వరరావు, సర్పంచ్ బూరల్లి శంకర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

పొందూరు:

ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేయాలని పొందూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పి.జ్యోత్స్న అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. వ్యర్థాలను సేకరించడం, వేరు చేయడం, శుద్ధి చేయడం వంటి ప్రక్రియలు సరైన పద్ధతిలో చేయాలని సూచించారు. డంపింగ్ యార్డుల నిర్వహణలో లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణలో లోపాలు వల్లే అంటు వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ప్లాస్టిక్‌తో ముప్పు పొంచి ఉందని, వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సదస్సులో సర్పంచ్ రేగిడి లక్ష్మి, లాయర్లు వై.వి.బ్రహ్మాజీ, కె.కృష్ణారావు, ఎం.రాము, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రమాణ స్వీకారం వీక్షణ


నరసన్నపేట: ప్రమాణ స్వీకారాన్ని వీక్షిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


పాతపట్నం: చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని తిలకిస్తున్న అధికారులు, ప్రజలు

నరసన్నపేట: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని నరసన్నపేటలో పలు చోట్ల కార్యకర్తలు, నాయకులు వేర్వేరుగా ఎల్‌ఈడీ స్క్రీన్లపై తిలకించారు. స్థానిక జట్టు కలాసీ సంఘ భవనం వద్ద తహసీల్దార్ కనకారావు, ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. స్థానిక వెలుగు భవనంలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ రెండు చోట్ల కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అధికారులతో పాటు టీడీపీ నాయకులు సాసుపల్లి కృష్ణబాబు, తాలాభక్తుల గోవిందరావు, బోయిన సతీష్, సదాశివుని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..


పాతపట్నం: నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలోని బ్రాహ్మణవీధి కూడలిలో ఉన్న కేఎస్ఎం కల్యాణ మండలంలో తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని స్క్రీన్‌పై వీక్షించారు. ఎంపీడీఓలు రామకృష్ణరాజు, అప్పలనాయుడు, ఏపీఓ సురేష్, ఏఎస్ఓ బాలరాజు, సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని మండలం కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వీక్షించారు. మండలంలోని మహిళ సంఘాల సభ్యులు, ఉపాధి పథకం సిబ్బందితోపాటు పలు శాఖలకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు


పూజలందుకున్న అయ్యప్పస్వామి


అభిషేకాలు అందుకున్న లక్ష్మీగణపతిస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవకొండ శంకర నారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

లక్ష్మీగణపతికి అభిషేకాలు

బలగలోని శ్రీబాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో లక్ష్మీ గణపతి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్‌గురూజీ ఆధ్వర్యంలో స్వామికి పూజలు, అలంకరణలు చేశారు.